
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

బుధవారం 17 జూలై 2024



గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు 8లో..

బొగ్గు బ్లాకుల వేలంపై రాద్ధాంతం 8లో..



'స్థానిక' ఎన్నికలపై సందిగ్ధం

- రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- బీసీ కులగణన చేపడితే మరింత ఆలస్యం
- ఐదున్నర నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక పాలన
- ఆశావహుల్లో నెలకొన్న ఉత్కంఠ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికలపై సందిగ్ధత ఏర్పడింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెల కొన్నది. బీసీ కులగణన చేపడితే మరింత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఐదున్నర నెలలుగా పంచా యతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఇది ఇలాగే కొనసాగితే కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యే అవకాశాలు లేవు. రాష్ట్రంలో గ్రామ పంచాయ తీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి 2వ తేదీ వరకు పూర్తి కాగా, ఎన్నికలు నిర్వహించ లేదు. పాలక వర్గాల స్థానంలో ప్రత్యేక అధి కారులను ప్రభుత్వం నియ మించింది. పాలక వర్గాలు లేని కారణంగా గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదు. పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు ఎనిమిది నెలలుగా రావడం లేదు. దీంతో ప్రత్యేక అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

2018లో గత ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుక వచ్చింది. ఈ చట్టం ద్వారా పంచాయతీలు, మండల, జిల్లా పరిష త్‌లు, మున్సిపా లిటీల్లో రిజర్వేషన్లను పదేళ్ల విధించారు. రొటేషన్ పద్ధతిన మార్చాలని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో రాష్ట్రంలో కొన్ని కొత్త మండలాలతో పాటు, గ్రామ పంచాయతీలు కూడా ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లను మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. పంచాయతీ రాజ్ చట్ట సవరణ చేస్తేనే గానీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో ఎన్నికలు ఆలస్యం అవుతున్నాయి.

మరింత ఆలస్యమయ్యే అవకాశం..

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో భాగంగా బీసీల కులగణన చేస్తామని పేర్కొంది. ఆ మేరకు అసెంబ్లీలో ఆమోదం కూడా పొందింది. ఆ తర్వాత బీసీ కులగణన చేపట్టేందుకు రంగం సిద్ధం చేయగా, పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో కుల గణన చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు చేపట్టి తదనుగుణంగా రిజర్వేషన్లు తీసుకరావాలంటే కనీసం ఆరు మాసాలైనా పడుతుందని సోమవారం సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమైన అధికారులు పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఉన్నటువంటి రిజర్వేషన్ల విధివిధానాలను అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యం అయ్యే అవకాశాలున్నాయి. అలాగే మండల, జిల్లా పరిషత్ పాలక వర్గాల పదవీ కాలం కూడా జూలై 3, 4 తేదీల్లో పూర్తయ్యింది. అక్కడ కూడా ప్రత్యేక అధికారుల పాలన తీసుకవచ్చారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయితేనే ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వం కూడా రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణమాఫీ చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నది. ఆగస్టు 15వరకు ఆ ప్రక్రియ పూర్తయిన తర్వాత రిజర్వేషన్లపై ఆగస్టు నెలాఖరు వరకు అధ్యయనం చేయనున్నారు. ఆ తర్వాత పంచాయతీరాజ్ చట్ట సవరణ చేసిన అనంతరం సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. మండల, జిల్లా పరిషత్ ఎన్నికలను డిసెంబరులో నిర్వహించ వచ్చని తెలుస్తున్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహిస్తుందా అని ఎదురుచూస్తున్నారు. బీసీ గణన ప్రకారం ఎన్నికలకు వెళ్లినట్లయితే మాత్రం మొత్తం స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాదే జరుగుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

సీఎం సమావేశానికి మంత్రి, కలెక్టర్, సీపీ హాజరు



సీఎం నిర్వహించిన సమావేశానికి హాజరైన కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన కలెక్టర్లు, ఎస్పీల సమావేశానికి జిల్లాకు చెందిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కలెక్టర్ కోయ శ్రీహర్ష, రామ గుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ హాజరయ్యారు.

జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి బదిలీ

పెద్దపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి వై తిరుపతిరావును కరీంనగర్‌కు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయన స్థానంలో ఇంకా ప్రభుత్వం ఎవరిని నియమించ లేదు. పెద్ద పల్లి జిల్లా ఏర్పాటైన నాటి నుంచి తిరుపతిరావు జిల్లాలో సుదీర్ఘ కాలం పాటు సేవలను అందించారు.

రేపటి నుంచి డీఎస్సీ పరీక్షలు : డీఈవో

పెద్దపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ నియామకాల కోసం నిర్వహించే డీఎస్సీ 2024 పరీక్షలను ఈనెల18 నుంచి ఆగస్టు 5 వరకు నిర్వహించ నున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి 7150 మంది అభ్యర్థులు హాజరుకానున్నారని, వీరి కోసం 3 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు, మొదటి సారిగా కంప్యూటర్ ఆధారిత ఆన్లైన్ విధానంలో నిర్వహించనున్న ఈ పరీక్షలు మొదటి విడత ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు, రెండవ విడత మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4:30గంటల వరకు ఉంటాయని పేర్కొన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిర్ణీత సమయానికి గంటన్నర ముందు నుంచి లోపలికి అనుమతిస్తారని పేర్కొన్నారు. పది నిమిషాల ముందు గేట్లు మూసివేస్తారని, అభ్యర్థులు తప్పనిసరిగా హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలని, గడియారాలు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు నిబంధనల్లో పేర్కొన్నవి అనుమతించబడవని పేర్కొన్నారు.

హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలుచేయవద్దు

తెలంగాణ క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు సతీష్



పాదయాత్ర నిర్వహిస్తున్న వాహనాల డ్రైవర్లు

కళ్యాణ్‌నగర్, జూలై 16: తెలంగాణలో హిట్ అండ్ రన్ చట్టాన్ని అమలు చేయవద్దని తెలంగాణ రాష్ట్ర క్యాబ్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కౌడ సతీష్ అన్నారు. జిల్లా అధ్యక్షుడు మొండెద్దుల మల్లేష్ ఆధ్వర్యంలో మంగళవారం లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలని, డ్రైవర్లకు తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ, ఇండ్లస్థలాలు కేటాయించాలని కోరారు. అర్హులైన డ్రైవర్లకు కార్పొరేషన్ల ద్వారా వాహనాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. హిట్ అండ్ చట్టాన్ని అమలు చేయవద్దని, ఈ చట్టంతో డ్రైవర్లకు ఇబ్బందులు కలుగనున్నాయన్నారు. ఎంవీ యాక్ట్-2019ని రద్దు చేసి డ్రైవర్లకు ఉపశమనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ బస్టాండ్ నుంచి లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, వైస్‌ప్రెసిడెంట్ మహ్మద్ అఫ్జల్, పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశం, ప్రధానకార్యదర్శి బేతి రవి, కోశాధికారి పంజాల శ్రీనివాస్, కార్యదర్శి దిలీప్, సభ్యులు రమేష్, భాస్కర్, విజయ్, జనార్ధన్, కుమార్, రామరాజు, నేతాజి, బాపన్న, సురేష్, క్రాంతి పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దపల్లిటౌన్, జూలై 16: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్ సైకాలజిస్ట్ డాక్టర్ మధుకర్‌రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ డాక్టర్ ఎ.మధుసూదన్‌లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సమీకృత బాలికల వసతి గృహంలో ఎస్సీ, బీసీ వసతి గృహాల్లోని 4వ తరగతి సిబ్బందికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో పాల్గొని సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు, వృత్తి నిబంధనలపై అవగాహన కల్పించారు. హాస్టల్ ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచడం ద్వారా పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రక్షించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి ఎం నాగలేశ్వర్, బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి, విజయపాల్‌రెడ్డి, వినోద్, సంక్షేమ అధికారులు, ఎస్సీ, బీసీ వసతిగృహ సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

- జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పుట్ట మధుకర్

పెద్దపల్లిటౌన్, జూలై 16: నిరుద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని జడ్పీ మాజీ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. జిల్లా గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి పాఠకుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ యువత, నిరుద్యోగులకు మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. ఎన్నికల ముందు ఓట్లు దండుకుని అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోందని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు గ్రంథాలయాల్లో సౌకర్యాలతోపాటు భోజన వసతులు కల్పించామని వివరించారు. గ్రంథాలయాలు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అధ్వానంగా మారాయన్నారు. గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగుపరచడంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యేలు విజయరమణారావు, మాక్కన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి గ్రంథాలయాల్లో అన్ని సౌకర్యాలు కల్పించడంతో పాటు శిథిలావస్థలో ఉన్న భవనం నుంచి గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ సిబ్బందికి ప్రత్యేక నంబర్లు



బ్లూకోల్ట్స్ సిబ్బందికి పరికరాలు అందజేస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, జూలై 16: గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న బ్లూ కోల్ట్స్, పెట్రోకార్ డ్యూటీచేస్తున్న సిబ్బందికి పర్మినెంట్ మొబైల్ నంబర్లు కేటాయించినట్లు ఏసీపీ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి ఫోన్‌నెంబర్ సిమ్‌లను అందజేశారు. బ్లూకోల్ట్స్ సిబ్బంది నైట్ టైమ్‌లో గస్తీ తిరుగుతున్నప్పుడు ఖచ్చితంగా లాఠీలు తీసుకువెళ్లాలన్నారు. అదేవిధంగా పెట్రోలింగ్ సిబ్బందికి టార్చ్‌లైట్లు కూడా అందిస్తున్నామన్నారు. వర్షాకాలంలో సిబ్బంది మొబైల్స్, ట్యాబ్‌లు పాడవకుండా బ్యాగులు అందించినట్లు ఏసీపీ తెలిపారు.

ఈ సందర్భంగా బ్లూకోల్ట్స్-1 9959822621, బ్లూకోల్ట్స్-2 9676942622, బ్లూకోల్ట్స్-3 9032942623, పెట్రోకార్‌నంబర్ 6309242624ను కేటాయించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు ఇంద్రసేనారెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

బదిలీపై వెళుతున్న పోలీసులకు సన్మానం

కోల్‌సిటీ, జూలై 16: రామగుండం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఆరు సంవత్సరాల పాటు పని చేసి బదిలీపై వెళుతున్న కానిస్టేబుళ్లను మంగళవారం సీఐ రాజేంద్రప్రసాద్ సత్కరించారు. హెడ్ కానిస్టేబుల్ రాజేశం, కానిస్టేబుళ్లు రాజమౌళి, లక్ష్మణ్, సంపత్‌కుమార్, అశోక్‌లను సత్కరించి వీడ్కోలు పలికారు. ఇన్నాళ్లు రిమార్కు లేకుండా పనిచేశారని, భవిష్యత్‌లో ఇదే విధానాన్ని కొనసాగించాలన్నారు.

● జూలపల్లి, జూలై 16: జూలపల్లి ఏఎస్‌ఐ శ్రీనివాస్‌రావు ఇటీవల రామగుండం ట్రాఫిక్ విభాగంకు బదిలీ కాగా ఆయనను మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శ్రీధర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు సన్మానించారు.

ఈ కార్యక్రమంలో నాయకులు మానుమండ్ల శ్రీనివాస్, అమరగాని సాయి, నెరువట్ల మహేందర్, మాతంగి చిరంజీవి, రమేష్ పలువురు పాల్గొన్నారు.

పత్తి సాగులో జాగ్రత్తలు పాటించాలి

కమాన్‌పూర్, జూలై 16 : పత్తి సాగులో రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో పత్తి పంట సాగు చేపడుతున్న రైతులతో మాట్లాడారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, పొడి వాతావరణ వల్ల పత్తిలో రసం పీల్చు పురుగుల ఉదృతి అధికంగా ఉందని తెలిపారు. ఈ లక్షణాలు గమనించిన రైతులు నీటి సౌకర్యం ఉన్న భూమిలో తడి పెట్టుకుని ఎకరాకు 40 గ్రాము. ఎసిటమిప్రిడ్‌ను పిచికారి చేయాలన్నారు. నెల వయస్సున్న పత్తి పంటకు ఎరువులు వేయని రైతులు ఎకరాకు 25 కిలోల యూరియా, 10 కిలోల పోటాష్‌ను వేసుకోవాలన్నారు. తొలి దశలో ఆశించే పురుగులను అదుపు చేసేందుకు కాండం మీద పూత పద్ధతిని పాటించాలన్నారు. మూడు పర్యాయాలు 30,45 రోజుల్లో మెనోక్రోటస్ 1:4 నిష్పత్తిలో వాడాలన్నారు. తిరిగి 60 రోజుల వయసులో ఇమిడాక్లోప్రిడ్ వాడాలని సూచించారు.

అంజన్న సేవలో న్యాయమూర్తులు



కొండగట్టులో న్యాయమూర్తి మహేష్‌నాథ్

మల్యాల, జూలై 16: కొండగట్టు ఆంజనేయస్వామిని మంగళవారం పలువురు న్యాయమూర్తులు దర్శించుకున్నారు. సిద్దిపేట జూనియర్ సివిల్ జడ్జి వి.చందన, మల్కాజిగిరి సీనియర్ సివిల్ జడ్జి జీవీ మహేష్‌నాథ్ వేర్వేరుగా స్వామి వారిని దర్శించుకున్నారు. న్యాయమూర్తులకు అధికారులు, అర్చకులు స్వాగతం పలుకగా స్వామి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అనం తరం స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈవో చంద్రశేఖర్ తదితరులు సత్కరించారు.

● అంజన్నను దర్శించుకున్న పూర్ణ



స్వామివారి సన్నిధిలో పూర్ణ

ఎవరెస్ట్ శిఖరం అధిరోహించిన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు చెందిన పూర్ణ మంగళవారం కొండగట్టుకు వచ్చి ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణను ఆశీర్వదించారు

రుణమాఫీ జీవోను సవరించాలి

జమ్మికుటం,జూలై 16: రుణమాఫీ జీవోను రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చెల్పూరి రాజు అన్నారు.పట్టణంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే 2 లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక ఇచ్చి హామీలను విస్మరిస్తూ జీవోల పేరిట అయోమయా నికి గురిచేస్తున్నారని మండిపడ్డారు. రేషన్ కార్డు ఆధారితంగా ఉన్నవారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించి కుటుంబంలో ఒక్కరికే రుణమాఫీ చేస్తే కుటుం బం నుంచి విడిపోయిన వారికి రుణమాఫీ వర్తించదన్నారు. పది సంవత్సరాలుగా రైతులు రుణాలు తీసుకొని వడ్డీలు పెరిగి ఇబ్బంది పడుతున్నారన్నారు. గత ప్రభుత్వం రుణమాఫీ సరిగా చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ప్రతి రైతుకు రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు.

పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే కేటాయించాలి

జమ్మికుంట,జూలై16: ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ నిధులను కార్మికుల వేతనాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక గ్రాంట్ ద్వారా విడుదల చేసిన నిధులలో మొదటి ప్రాధాన్యతగా గ్రామ పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలని అన్నారు. జిల్లాలో నాలుగు కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ మండల కార్యదర్శి రవీందర్‌రావు, ఆసాల సారయ్య, రవి ఉన్నారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట,రూరల్16: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ. 7,450 పలికింది. మంగళవారం మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు తొమ్మిది క్వింటాళ్ల పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ట ధర.7,450 కనిష్ట ధర రూ.7,200 చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

ఫేక్ మెసేజ్‌తో మోసం చేసిన వ్యక్తి అరెస్టు

జగిత్యాల టౌన్, జూలై 17: బట్టల షాపులో చీరెలు కొని రూ.10 వేలు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపినట్లు ఫేక్ మెస్సేజ్ చూపించి మోసం చేసిన వ్యక్తిని మంగళవారం జగిత్యాల పోలీసులు పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాలలోని ఓ బట్టల దుకాణంలో ఈ నెల 12న నెంబర్ ప్లేట్ లేని బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి మోసానికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితురాలు జగిత్యాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం టౌన్ సీఐ వేణు గోపాల్ ఆధ్వర్యంలో పోలీసులు విద్యానగర్ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఓ వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుండగా పట్టుకున్నారు. విచారణలో ఇటీవల జగిత్యాల పట్టణంలో ఫేక్ మెస్సేజ్‌తో రూ. 10 వేలు మోసం చేసిన వ్యక్తిగా గుర్తించారు. నిందితుడు మంచిర్యాల జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లికి చెందిన రామగిరి సురేష్‌గా గుర్తించి అతని వద్ద రూ. 5 వేల నగదుతో పాటు ఒక సెల్‌ఫోన్, నెంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసినట్లు సీఐ వివరించారు. నిందితుడిపై ఇదివరకే నిర్మల్ జిల్లాలోని నిర్మల్ టౌన్‌తో పాటు మంచిర్యాల జిల్లా నెన్నెల, జగిత్యాల జిల్లా సారంగాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసులు నమోదైనట్లు వివరించారు.

మద్యం మత్తులో ఒకరి ఆత్మహత్య

రుద్రంగి, జూలై 16: రుద్రంగి మండల కేంద్రంలోని నేవూరిపల్లెకు చెందిన నేవూరి అంజయ్య(28) మద్యం మత్తులో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంజయ్య మద్యానికి బానిసై నిత్యం తాగి వచ్చి భార్యను కొట్టేవాడు. కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెందిన అంజయ్య పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలకు సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. అంజయ్య భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం

వీర్నపల్లి, జూలై 16: రుద్రంగి మండలం చింతామణి తండాకు చెందిన గుగులోత్ హరిసింగ్(60) అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. రుద్రంగి మండలం చింతమణితండాకు చెందిన గుగులోత్ హరిసింగ్ శనివారం భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. హరిసింగ్ ఆచూకీ లభించలేదు. భార్య గుగులోత్ దేవి రుద్రంగి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

గట్టుదుద్దెనపల్లిలో చోరీ

మానకొండూర్, జూలై 16 : మండలంలోని గట్టుదుద్దెనపల్లి గ్రామంలో మంగళవారం దొంగతనం జరిగింది. స్థానిక సీఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆకుల భారతమ్మ అనే మహిళ ఐదు రోజుల క్రితం కనపర్తి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. మంగళవారం ఇంటికి వచ్చిన మహిళ ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగుల కొట్టి ఉండడాన్ని గమనించి లోపలికి వెళ్లి చూసినట్లు తెలిపారు. ఇంటిలోని బీరువాను పగుల కొట్టి అందులోని రెండు తులాల చంద్రహారం, పట్టగొలుసులు దొంగిలించుకపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన ఆర్టీసీ డ్రైవర్ మృతి


మనోహర్‌రెడ్డి (ఫైల్)

కరీంనగర్ అర్బన్, జూలై 16: ఆర్టీసీ కరీంనగర్- 1 డిపో డ్రైవర్‌గా పని చేస్తున్న చిట్యాల మనోహర్‌రెడ్డి (55) ఈనెల 7న ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మనోహర్‌రెడ్డి 7వ తేదీ మధ్యాహ్నం విధులకు హాజరైన సమయంలో ఆర్టీసీ అధికారులు డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా ఆల్కహాల్ శాతం 21 వచ్చింది. దీంతో డ్యూటీ చేయడానికి నిరాకరించిన అధికారులు నోటీసులు జారీ చేసి సస్పెండ్ చేశారు. మనస్థాపం చెందిన డ్రైవర్ మనోహర్‌రెడ్డి వన్ డిపోలో బాత్ రూములో పురుగుల మందు తాగి పడి పోయి ఉండగా తోటి ఉద్యోగులు చూసి వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తర లించారు. చికిత్స పొందుతున్న మనోహర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. దీంతో కుటుంబసభ్యులు, ఆర్టీసీ కార్మికులు మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ డిమాండ్ చేశారు. అప్పటి వరకు మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు నిరాకరించారు. దీంతో ఆర్టీసీ పీఓ చంద్రయ్య, డిప్యూటీ ఆర్‌ఎం (మెకానికల్) సత్యనారాయణలు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇచ్చే విషయం తమ పరిధిలో లేదని, ఉన్నతాధికారులకు రెకమండ్ చేస్తామని ఆర్టీసీ ఉద్యోగ సంఘ నాయకులకు, మృతుడి కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు పంచనామా చేసి పోస్టుమార్టం నిర్వహించారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ఎండపల్లి, జూలై 16: మండలంలోని కొండాపూర్ గ్రామానికి చెందిన రాయమల్లు (42) అనే యువకుడు మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన రాయమల్లు గతంలో పది సంవత్సరాలు సింగాపూర్ వెళ్లి ఇంటికి తిరుగొచ్చి పంచర్ కొట్టు నిర్వ హించుకుంటూ జీవిస్తున్నాడు. రాయమల్లు తండ్రి గతంలోనే మృతి చెందాడు. తల్లి మానసిక పరిస్థితి సరిగ్గా ఉండదు. ఇద్దరు కూతుళ్లు, భార్యతో పాటు తల్లిని పోషిస్తూ ఉండేవాడు. తనకు ఏ ఆపదొచ్చినా వెనకా ముందు ఎవరూ లేరని తరచూ తన భార్యతో చెప్పుకుంటూ మానసికంగా కృంగిపోయేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఉద యం భార్యను నిద్ర లేపిన రాయమల్లు ఇంట్లోనే కాసేపటికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నిద్రలోంచి లేచిన పిల్లలు ఒక్కసారిగా తండ్రిని చూసి షాక్‌కు గురయ్యారు. అమ్మా నాన్నకు ఏమైంది. పిలిస్తే మాట్లాడుత లేదు అంటూ తల్లితో రోదించిన తీరు అక్కడున్న వారిని కన్నీళ్లుపెట్టించింది. భార్య స్వరూప ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లాభాల బాటలో ఆర్టీసీ లాజిస్టిక్స్

● ఏటా పెరుగుతున్న ఆదాయం ● పది కోట్లకు చేరువలో సంవత్సర ఆదాయం


పార్సిల్స్ బుక్‌చేరుకోవడానికి వేచి ఉన్న కస్టమర్లు

భగత్‌నగర్, జూలై 16: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులను చేరవేయడంతో పాటు ఆదాయ వనరులను అన్వేశిస్తున్నది. లాభాలు అంతంత మాత్రంగానే ఉన్న ఆర్టీసీకి జవసత్వాలు అందించేందుకు ఆర్టీసీలో కార్గో, లాజిస్టిక్స్‌ను 2020 సంవత్సరంలో ప్రవేశ పెట్టారు. ఆర్టీసీ కరీంనగర్ రీజియన్‌లో 11 డీఓలు కరీంనగర్-1, కరీం నగర్-2, గోదావరిఖని, మంథని, జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, హుస్నాబాద్ డిపోలున్నాయి. నిత్యం ఆర్టీసీ బస్సులు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు వెళ్తుండడాన్ని దృష్టిలో ఉంచుకుని పార్సిల్స్, పార్సిల్ కవర్స్, ప్రజలు తమకు సంబంధించిన వారికి వస్తువులను ఆర్టీసీ ద్వారా పంపిస్తుండడంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ లాభాల బాటలో పయనిస్తున్నది.


బార్‌కోడ్ ద్వారా వస్తువులను పరిశీలిస్తున్న సిబ్బంది

రీజియన్ వ్యాప్తంగా ఏటా పెరుగుతున్న ఆదాయం

రీజియన్ వ్యాప్తంగా 2020-21 సంవత్సరంలో 3,41,905 పార్సిల్స్ బుక్ చేసి 3,00,00,980 రూపాయలను ఆర్జించారు. 2021-22సంవత్సరంలో 5,40,728 పార్సిల్స్ బుక్‌చేసి 5,56,38,384 రూపాయలు ఆర్జించారు. 2022-23 సంవత్సరంలో 5,80,651 పార్సిల్స్ బుక్‌చేసి 7,47,62,857 రూపాయలు, 2023-24 సంవత్సరంలో 5,92,212 పార్సిల్స్ బుక్‌చేసి 9,32,99,988 రూపాయలు ఆర్జించారు. ఈ సంవత్సరం ఏప్రిల్ 2024 నుంచి జూన్ వరకు 1,33,047 పార్సిల్స్ బుక్‌చేసి 2,34,96,206 రూపాయల ఆదాయాన్ని అర్జించారు.

రీజియన్‌లోని వివిధ డిపోల్లో వచ్చిన ఆదాయం

కరీంనగర్ రీజియన్‌లో 11 డిపోల్లో 2023-24 సంవత్సరంలో ఏటా లాజిస్టిక్స్ ఆదాయం పెరుగుతూ 9,32,99,988 రూపాయల ఆదాయం సమకూరింది. గోదావరిఖని డిపోలో 68,671 పార్సిల్ బుక్ చేసి 1,10,37,640 రూపాయలు, హుస్నాబాద్ 11,138 పార్సిల్స్‌కు 15,31,046 రూపాయలు, హుజూరాబాద్ 20,645 పార్సిల్స్‌తో 37,15,332 రూపాయలు, కరీం నగర్-1 డిపోలో 2,98,823 పార్సిల్స్‌తో 4,67,46,316 రూపాయలు, కరీంనగర్-2 డిపోలో 11,549 పార్సిల్స్‌తో 27,16,433 రూపాయలు, మంథని డిపోలో 8,435 పార్సిల్స్‌తో 12,39,473 రూపాయలు వచ్చింది.

జగిత్యాల డిపోలో 63,872 పార్సిల్స్‌తో 86,27,859 రూపాయలు, కోరుట్ల డిపోలో 19,788 పార్సిల్స్‌తో 27,57,522 రూపాయలు, మెట్‌పల్లి డిపోలో 21,046 పార్సిల్స్‌తో 27,48,054 రూపాయలు, సిరిసిల్ల 55,453 పార్సిల్స్‌తో 1,04, 58,060, వేములవాడ 12,792 పార్సిల్స్‌తో 17,22,253 రూపాయల ఆదాయం వచ్చింది. మొత్తానికి 2020-21 నుంచి నేటి వరకు ప్రతి సంవత్సరం ఆర్టీసీ లాజిస్టిక్స్ ఆదాయం ప్రతి ఏటా రెండు కోట్ల మేర పెరుగుతూ వస్తున్నది. ప్రయాణికులను చేరవేయడంతో పాటు పార్సిల్స్, కార్గో ద్వారా వస్తువులను చేరవేస్తూ ఆర్టీసీ ప్రజల మన్ననలు పొందుతున్నది.

కొత్త సాఫ్ట్‌వేర్‌తో సులభతరం: లాజిస్టిక్స్ ఏటీఎం సదాశివ్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రారంభించిన కార్గో, లాజిస్టిక్ సేవలతో ప్రయాణికులకు మరింత చేరువయ్యాం. కొత్తగా ప్రవేశపెట్టిన సాఫ్ట్‌వేర్‌తో పార్సిల్స్ వస్తువులను ప్రయాణికులను సులభంగా చేరవేస్తున్నాం. బార్‌కోడ్ సిస్టంతో వస్తువులను సులభంగా తెలుసుకునే వీలుంది. బస్సులు చేరుకునే సమయానికి పార్సిల్స్ ప్రజలకు అందుతుండడంతో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తున్నది. ఈ సంవత్సరం 11 కోట్ల మేర ఆదాయం రాబట్టాలన్నదే లక్ష్యంగా నిర్ణయించుకున్నాం.


పార్సిల్స్‌ను సిస్టంలో పరిశీలిస్తున్న సిబ్బంది

షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

● 11 తులాల బంగారం, రూ. 4లక్షల నగదు ఆహుతి
● తప్పిన ప్రాణాపాయం

వెల్గటూర్, జూలై 16: మండలంలోని పైడిపల్లిలో గాదెనవేని మల్లయ్య ఇంటిలో మంగళవారం విద్యుదాఘాతంతో ప్రమాదం సంభవించింది. ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మల్లయ్యకు ముగ్గురు కుమారులు, కూతురు ఉన్నారు. మల్లయ్యతో పాటు అతని చిన్న కుమారుడు గాదెనవేని సత్తయ్య, కోడలు మమత కలిసి ఒకే ఇంటిలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు రమేష్ కొత్తగా ఇల్లు కట్టుకోవడం వలన వారికి సంబంధించిన వస్తువులు తండ్రి మల్లయ్య ఇంటిలోనే పెట్టాడు. మంగళవారం ఇంటిలో ఎవరి పనులకు వారు వెళ్లిన సమయంలో ఇంట్లో విద్యుదాఘాతంతో మంటలు వ్యాపించాయి. ఇంటిలో ఉన్న బట్టలకు, వడ్ల పరదాలకు మంటలు అంటుకొని ఇళ్లంతా వ్యాపించాయి. ఈ సంఘటనలో రమేష్‌కు చెందిన రూ.2 లక్షల నగదు, టీవీ, ఫ్రిజ్‌లు అగ్నికి కాలిపోయాయి. చిన్న కొడుకు సత్తయ్యకు చెందిన రూ. 2 లక్షల నగదు, అతని భార్యకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు, మల్లయ్య కూతురుకు చెందిన 5 తులాల బంగారు ఆభరణాలు పూర్తిగా కాలిపోయాయి. ఈ ప్రమాదంలో మొత్తం రూ.4 లక్షల నగదు, 11 తులాల బంగారు ఆభరణాలతో పాటు బట్టలు, వివిధ ఎలక్ట్రానిక్ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అగ్ని ప్రమాదం సంభవించిన వెంటనే గ్రామస్థులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. వారు వచ్చి మంటలు ఆర్పివేశారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగి పోయింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

తంగళ్లపల్లి, జూలై 16: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ట్రాక్టర్, కారు ఢీ కొన్న ఘటనలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. ట్రాక్టర్ (ట్రాలీ లేకుండా)పై డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి వెళ్తున్నారు. అతి వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. దీంతో ట్రాక్టర్ పైకూర్చున్న తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మునిగే ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డాడు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రేషన్ కార్డు లేకున్నా రూ.2 లక్షల రుణమాఫీ

● బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయాంలో వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా రుణమాఫీ ● ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, జూలై 16: రేషన్ కార్డు ఫ్యామిలీ యూనిట్ గుర్తింపు చేయడానికి తప్ప రుణమాఫీ అమలు చేయడానికి ఏ విధంగా అభ్యంతరం కాదని, రేషన్ కార్డు లేనివారు కూడా రూ.2 లక్షల రుణమాఫీ పొందే అవకాశం ఉందని ఎమ్మె ల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆనాడు యూపీఏ ప్రభుత్వం ఏకకాలంలో రూ.లక్ష రుణమాఫీ చేసిందని, మళ్లీ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ హాయాంలో రూ.2 లక్ష రుణ మాఫీ ఏకకాలంలో చేయడం హర్షించదగిన విషయమన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రెండు పర్యాయాలు రూ.లక్ష వరకు రుణమాఫీ చేస్తామని పేర్కొన్నప్పటికీ అది విడతలవారీగా వచ్చేసరికి కేవలం వడ్డీ మాఫీ అమలు కార్యక్రమంగా మిగిలిపోయిందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ప్రభుత్వంపై కొంత ఆర్థిక భారం అని భావించినప్పటికీ రైతు సంక్షేమం ప్రధానం కాబట్టి రాహుల్‌గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ఏ విధమైన ఆంక్షలు లేకుండా కుటుంబం ఒక యూనిట్‌గా ఆగస్టు 15లోపు రూ.2 లక్షలు పూర్తి స్థాయిలో రుణమాఫీ అమలు చేసే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

రేషన్ కార్డు అనేది ఫ్యామిలీ యూనిట్‌ను గుర్తింపు చేయడానికి మాత్రమే. దీనిపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్లారిటీ ఇచ్చారన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దేశంలో ఎక్కడా కూడా రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేపట్టడం లేదన్నారు. ఈరోజు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకృతి వైపరీత్యాలతోగానీ, చీడ పురుగులతోగానీ పంట నష్టపోతే వారిని ఆదుకునే విధంగా పంటల బీమా పథకం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు రూ.7500 ఇచ్చే విధంగా ముందుకు వెళ్తుందన్నారు. సన్న రకం సాగు చేసే రైతుకు ప్రతి క్వింటాల్‌కు రూ.500 మద్దతు ధరకు అదనంగా ఇస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు మాసాల్లో రాయికల్ మండలంలోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులకు నిధులు కేటాయించి పూర్తి చేశామన్నారు. అనంతరం మండలంలోని లోక్యనాయక్ తండా, మంగ్యానాయక్ తండాలో శీత్లా భవానీ, తీజ్ పండుగ ఉత్సవాల్లో పాల్గొని దర్శించుకున్నారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి ఉన్నారు.

లింగన్నపేట ఆందోళనలో 23 మందిపై కేసు

గంభీరావుపేట, జూలై 16 : గంభీరావుపేట మండలం లింగన్నపేటలో ఇటీవల శ్రీనాథ్ అనే యువకుడు ఆత్మహత్య చేసుకోగా మృతదేహంతో ఈ నెల 14న రోడ్డుపై ఆందోళన చేసిన ఘటనలో 23 మందిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాంమోహన్ తెలిపారు. లింగన్నపేటకు చెందిన తుడుం శ్రీనాథ్ ఈ నెల 10న ప్రేమ వ్యవహారంలో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. చికిత్స పొందుతూ 13న మృతి చెందాడు. శ్రీనాథ్ ఆత్మహత్యకు ప్రేమికురాలు కారణమంటూ బంధువులు 14న అర్ధరాత్రి దాటాక రోడ్డుపై బైఠాయించారు. వాహనదారులకు ఇబ్బంది కలిగేలా చేయడంతోపాటు ఉదయం కూడా శ్రీనాథ్ మృతదేహంతో మరోసారి ఆందోళన చేశారని, పోలీస్‌ల విధులకు ఆటంకం కలిగించారని ఎస్సై రాంమోహన్ వెల్లడించారు.

శ్రీనాథ్ ఇంటి నుంచి మృతదేహాన్ని గాంధీ వద్దకు తెచ్చే క్రమంలో పోలీస్‌లను బలవంతంగా తోసేశారని, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించారని తెలిపారు. ఈ సంఘటనలో 23 మందిపై కేసు నమోదు చేశామని, కేసు విచారణలో భాగంగా ఈసానిపల్లి శేఖర్, గంగి నరేష్, కొత్తపల్లి ప్రవీణ్‌ను రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎల్లారెడ్డిపేట, జూలై 16: ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలోని దుకాణం ఎదుట నిలిపి ఉన్న ద్విచక్రవాహనాన్ని మంగళవారం దొంగలు ఎత్తుకెళ్లారు. గొల్లపల్లిలోని కర్ర దుకాణం ఎదుట బైక్‌ను నిలిపి లోనికి వెళ్లి వచ్చే సరికి వాహనం కనిపించకుండాపోయింది. బైక్ చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

తాళం పగులగొట్టి రెండు ఇళ్లల్లో దొంగతనం

14 తులాల బంగారం, 37 తులాల వెండి ఆభరణాలు చోరీ

కరీంనగర్ క్రైం, జూలై 16: కట్టరాంపూర్‌లోని వినాయకనగర్, వివేకానందనగర్‌లో సోమవారం అర్ధరాత్రి దొంగలు తాళం వేసిన రెండు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. ఒకటో ఠాణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వినాయకనగర్‌కు చెందిన టి.మంగ పంచాయతీరాజ్ శాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నది.

ఆమెకు మంగళవారం ఉద్యోగ బదిలీ కోసం కౌన్సెలింగ్ ఉండటం తో ఈనెల 14న రాత్రి ఇంటికి తాళం వేసి హైదరాబాద్ వెళ్ళింది. మంగళవారం పక్క ఇంటివారు మంగ ఇంటి తలుపులు తెరచి, తాళం పగులగొట్టి ఉందని ఫోన్‌లో ఆమెకు సమాచారం అందించారు. ఆమె కరీంనగర్‌లోని ఇంటికి చేరుకుని పరిశీలించగా కప్‌బోర్డులో భద్రపరిచిన 14.3 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే పక్క ఇంటి వారి బైక్‌ను కూడా దొంగ లు ఎత్తుకుపోయారు. వివేకానందనగర్‌లో పద్మ ఈ నెల 13న ఉదయం ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లోని తన కొడుకు వద్దకు వెళ్లింది. ఆమె ఇంటి తాళం పగులగొట్టి ఉందని మంగళవారం స్థానికులు ఫోన్ చేయగా ఆమె కరీంనగర్‌కు వచ్చి చూసే సరికి ఇంటి బీరువాలో భద్రపరిచిన 17 తులాల వెండి ఆభరణాలు కనపడలేదు. దొంగలు ఇంటిలో చొరబడి చోరీ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాధితుల ఫిర్యాదు మేరకు దొంగతనం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాలను కరీంనగర్ ఒకటో ఠాణా సీఐ సరిలాల్, క్రైటీం పోలీసులు పరిశీలించారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలను పరిశీ లిస్తున్నారు. క్లూస్‌టీంతో వేలిముద్రలు, ఇతర ఆధారాలను సేకరించారు. నలుగురు దొంగలు చేతులకు గ్లౌస్, ముఖాలకు మాస్కులు వేసుకుని దొంగతనాలకు పాల్పడినట్లుగా పోలీసులు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

హైనా దాడిలో లేగదూడ మృతి

చిగురుమామిడి, జూలై 16: మండలంలోని గాగిరెడ్డిపల్లిలో దేవునూరి వెంకటేశ్ అనే రైతుకు చెందిన లేగదూడ హైనా దాడిలో మంగళవారం మృతి చెందింది. గ్రామ శివారులో తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో పాడి ఆవులతో పాటు లేగదూడను కట్టేసి సోమవారం సాయంత్రం రైతు వెంకటేశ్ ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూసే సరికి లేగదూడ మృతి చెంది ఉన్నది. తీవ్రంగా గాయపడ్డ లేగదూడను పరిశీలించగా హైనా దాడి అని నిర్ధారించినట్లు ఫారెస్టు అధికారులు తెలిపారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ సన్నీళ్ల వెంకటేశం కోరారు. చిగురుమామిడి మండలంలో హైనా దాడులు పెరిగి పోతున్నాయని, దీంతో రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లడానికి భయ పడుతున్నారని పలువురు పేర్కొంటున్నారు. హైనా దాడులను అధికారులు అరికట్టాలని డిమాండ్ చేశారు.

వాహనాల దొంగలను పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి, జూలై, 16 : మెట్‌పల్లి పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాలను అపహరించిన ఇద్దరు దొంగలను మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీవిలు పట్టుకున్నట్లు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు తెలిపారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో పట్టుకున్న దొంగలను చూపుతూ వివరాలను వెల్లడించారు. మండలంలోని చౌలమద్ది గ్రామానికి చెందని యాశాడ వెంకటి అనే రైతుకు సంబంధించిన మహేంద్ర ట్రాక్టర్ ట్రాలీని గ్రామ శివారులో జూన్ 29న ఉంచాడు. మండలంలోని రామా రావుపల్లి గ్రామానికి చెందిన పొన్నం రవీందర్‌గౌడ్ వ్యవ సాయం చేస్తూ ట్రాక్టర్ ట్రాలీలు కొంటూ అమ్ముతుండే వాడు. ట్రాక్టర్‌ల కోసం గ్రామాల్లో వెతుకు తుండగా చౌల మద్ది గ్రామ శివారులో ఉన్న యాశాడి వెంకటి ట్రాక్టర్ ట్రాలీని అపహరించాడు. అపహరించిన ట్రాలీకి రంగు మార్చి మరో చోట దాచాడు. మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలోని మణికంఠ వైన్స్ వద్ద ఈ నెల 12న చెప్పాల శంకర్ తన ద్విచక్ర వాహనాన్ని నిలిపాడు. మల్లాపూర్ మండలం రత్నాపూర్ గ్రామానికి చెందిన మదికుంట మహేష్ అనే వ్యక్తి మద్యానికి బానిసై నిలిపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించాడు. బాధి తుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సై చిరంజీ విలు పట్టణంలోని బస్ డీపో సమీపంలో వాహనాల తనిఖీలు చేస్తుండగా అను మానాస్పదంగా కనిపించిన ఇద్దరిని పట్టుకుని విచారిం చగా వాహనాలను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. అపహరించిన వాహనాలను వారి నుంచి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు.


బొలెరో, ట్రాక్టర్ ఢీ ఇద్దరు మృతి


మహేష్, అభిషేక్ (ఫైల్)

ధర్మారం, జూలై 16: పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం మల్లాపూర్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారు జామున బొలెరో, ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ గ్రామ శివారులో బొలెరో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పైన ఉన్న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం ఆర్నకొండ గ్రామానికి చెందిన సోమిడి అభిషేక్ (22) అక్కడికక్కడే మృతిచెందగా, ట్రాక్టర్ డ్రైవర్ చీకట్ల మహేష్ (30) ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. అలాగే తాండ్ర అశోక్‌కు అనే యువకుడికి గాయాలయ్యాయి. ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మంచిర్యాలలోని ఎన్‌టీఆర్ నగర్‌కు చెందిన బొలెరో డ్రైవర్ తూర్పటి రాజుపై మృతుడు మహేష్ తండ్రి పోచయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కట్టెలతో దాడి చేసి బంగారు, వెండి ఆభరణాల దోపిడీ

అనుమానితుల ఫొటోలు విడుదల చేసిన పోలీసులు


పోలీసులు విడుదల చేసిన అనుమానితుల ఫొటోలు

మల్యాల, జూలై 16: ఒంటరిగా ఉన్న ఓ వ్యక్తిపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసి బంగారు, వెండి ఆభరణాలు, నగదుతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 9న జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బండారి స్వామి కొడిమ్యాల మండలం నాచుపల్లికి వెలుతూ కొండగట్టు సమీపంలోని పెట్రోల్ బంక్ నుంచి క్వారీలకు వెళ్లే మార్గంలో ఆగాడు. ఒంటరిగా ఉన్నట్లు గుర్తించిన ఇద్దరు వ్యక్తులు కట్టెలతో వచ్చి స్వామిని కొట్టి అతని వద్ద గల బంగారం, వెండి, నగదు, సెల్‌ఫోన్ లాక్కొని పారిపోయారు. దీంతో బాధితుడు మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేయగా ఇద్దరు వ్యక్తుల ఆనవాళ్లను స్వామి తెలుపడంతో పోలీసులు అనుమా నితుల ఫొటోలను విడుదల చేశారు. ఈ ఫోటోలలో గల వ్యక్తుల వివరాలు తెలిస్తే తమకు సమాచారం అందించాలని తగిన పారితోషికం అందించనున్నట్లు సీఐ నీలం రవి, ఎస్సై నరేష్ ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న వరద

ప్రాజెక్టులోకి 5,150 క్యూసెక్కుల నీరు

జగిత్యాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం వరద నీరు చేరుతుండడంతో ప్రాజెక్టు నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పాటు, బాబ్లీ గేట్లు ఎత్తివేయడంతో ఎస్సారెస్పీలోకి 5,150 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 90.323 సామర్థ్యానికి ప్రస్తుతం 13.485 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 22.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 436 క్యూసెక్కుల నీటిని వదిలారు. జూన్ 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు ప్రాజెక్టులోకి 7.826 టీఎంసీల వరద నీరు వచ్చి చేరగా, 1.861 టీఎంసీల నీటిని వివిధ అవసరాల నిమిత్తం వ్యయం చేశారు.

ఒకరి రిమాండ్

సిరిసిల్ల క్రైం, జూలై 16: జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన బాస ఎల్లవ్వ మెడలో నుంచి పుస్తెల తాడు చోరీ చేసిన మెదక్ జిల్లా గజ్వేల్‌కు చెందిన పర్వతం నర్సింహులును మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. మల్లాపూర్ గ్రామంలో ఎల్లవ్వ తన ఇంటి ముందు నిద్రపోతున్న సమయంలో ఈ ఏడాది జూన్ 21న సిద్దిపేట జిల్లా దుబ్బాకకు చెందిన మరో వ్యక్తితో కలిసి నర్సింహులు ద్విచక్రవాహనంపై వచ్చాడని, పుస్తెలతాడు తెంపుకొని పారిపోయాడని పేర్కొన్నారు. ఇదే సమయంలోనూ మల్లాపూర్ గ్రామంలో తాటిపల్లి బాలకిషన్, ఎడ్ల రమేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్లు ఎత్తుకెళ్లారని తెలిపారు. బాధితుల ఫిర్యాదుతో సాంకేతిక సమాచారం ఆధారంగా సిరిసిల్ల వైపు వస్తున్న నర్సింహులును అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. మూడు తులాల పుస్తెలతాడు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు, మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు చెప్పారు.

ఊర కుక్క దాడిలో బాలుడికి గాయాలు


దేవేందర్ (ఫైల్)

బీర్‌పూర్, జూలై 16: ఊర కుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలై స్పృహ కోల్పోయిన ఘటన బీర్‌పూర్ మండలంలోని మంగేళ గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. మంగేళ గ్రామంలోని గోండుగూడెంకు చెందిన పెంద్రం మారుతి ప్రతిభలకు ఇద్దరు పిల్లలున్నారు. పెద్ద కుమారుడు దేవేందర్ (7) సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఆడుకుంటుండగా ఊర కుక్క వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. మొఖం, తల వెనుక భాగంలో, చెవి దగ్గరా గాయ పరచగా చెవి తెగింది. ఈ దాడిలో బాలుడు స్పృహ కోల్పోయాడు. సమీపంలో ఉన్న కాలనీ వాసులు గమణించి కుక్క దాడి నుంచి బాలుడిని రక్షించి జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు.



ఒకేషనల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 16: సింగరేణి సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఒకేషనల్ కోర్సులకు ఆసక్తిగల ప్రభావిత గ్రామాల మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆర్జీ-2 అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈనెల 20(శనివారం) ఆర్జీ-2 సేవా సమితి కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరించ నున్నట్టు, ఆసక్తి గల వారు, ఫ్యాకల్టీకి దరఖాస్తు చేసుకునే వారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్, ఫొటోలతో దరఖాస్తులను అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

పారిశుధ్య పనులపై జీఎంకు వినతి

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 16: సింగరేణి ప్రభావిత గ్రామమైన వెంకట్రావ్ పల్లెలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతూ మాజీ సర్పంచ్ బుర్ర ముత్యాలుగౌడ్ మంగళవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు. కేకేనగర్ దారికి ఇరువైపులా చెట్లు పెరిగి ఇబ్బందికరంగా ఉన్నదన్నారు. వర్షపు నీటితో మురుగు కాల్వలు నిండి రోడ్లపై, ఇళ్ల మధ్య ప్రవహిస్తున్నట్టు తెలిపారు. చెట్ల పొదలను తొలగించడంతో పాటు కాల్వలను శుభ్రం చేసే పనులు పూర్తిచేయాలని బుర్ర ముత్యాలు జీఎంను కోరారు.

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి

శ్రీరాంపూర్, జూలై 16 : కాంట్రాక్టు కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కృషి చేస్తామని శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి సంజీవరెడ్డి అన్నారు. కాంట్రాక్టు కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు ఆర్కె 8 డిస్పెన్సరీలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎంఓ డాక్టర్ రమేష్ బాబు, డీజీఎం(సివిల్) ఆనంద్ కుమార్, వైద్యులు లోక్ నాథ్ రెడ్డి, మురళీధర్, సివిల్ ఇంజనీర్లు రాము, సత్యనారాయణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వేగంగా బొగ్గు అందించాలి

శ్రీరాంపూర్, జూలై 16: దేశవ్యాప్తంగా బొగ్గుకు చాలా డిమాండ్ ఉందని, వినియోగదారులకు వేగంగా అందించాలని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్స్, ప్లానింగ్) జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఓసీపీని మంగళవారం ఆయన సందర్శించారు. క్వారీలోని జీవీఆర్, సాఆర్ఆర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియా జీఎం బి. సంజీవరెడ్డి, శ్రీరాంపూర్, ఇందారం ఓసీపీల ప్రాజెక్ట్ అధి కారులు ఎం. శ్రీనివాస్, టి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శీత్ల భవాని వేడుకలు

పాలకుర్తి, జూలై 16:మండలం పరిధిలోని బామ్లానాయక్ తండాలో మంగళవారం గిరిజనుల కుల దైవమైన శీత్ల భవాని వన జాతర పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు పాల్గొన్నారు.

గోడ గడియారాల పంపిణీ

సుల్తానాబాద్, జూలై 16: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థినులకు ఉచితంగా గోడ గడియారాలను పంపిణీ చేశారు. ఈ పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా పని చేస్తున్న బి శైలజ గోడ గడియారాలను మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ఎం స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు అదనపు సిబ్బంది

కోల్‌సిటీ, జూలై 16: ట్రాఫిక్ రద్దీ ఉండే ప్రాంతాల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో పాటు అదనపు సిబ్బందిని నియమిస్తామని రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు పేర్కొన్నారు. మంగళవారం మెయిన్ చౌరస్తా, బస్టాండ్ ఏరియాలలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆయన పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆటోలను క్రమపద్ధతిలో పెట్టుకోవాలని, ఖచ్చితంగా యూనిఫాం ధరించాలన్నారు. ప్రయాణికులతో మర్యాదగా మెదలాలన్నారు. మార్కెట్‌లో టిఫిన్లు, టీలకు వచ్చే వాహనదారులు రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ తమ వాహనాలను పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయని, ఇలా అయితే ఫోటోలు తీసి ఫైన్లు వేస్తారన్నారు. వాహనాలను క్రమపద్ధతిలో నిర్దేశిత ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని ఆయన సూచించారు.

అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట..

కాల్వశ్రీరాంపూర్, జూలై 16: అమ్మ మాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా కాల్వశ్రీరాంపూర్, ఇప్పలపల్లెలో అంగన్‌వాడీ టీచర్లు మంగళవారం పిల్లలతో ర్యాలీ నిర్వహించారు. రెండున్నర సంవత్సరాల నుంచి ఐదు సంవత్సరాలలోపు బాలబాలికలు అంగన్‌వాడీ సెంటర్‌లో చేర్పించాలనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తల్లులకు ప్రీస్కూలు, విద్యా ప్రాముఖ్యత, పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సావిత్రి, ఏఎన్‌ఎం సరోజన, అంగన్‌వాడీ టీచర్లు హాజీర, సునీత, స్వరూప, రజిత, సుమలత, భూలక్ష్మి పాల్గొన్నారు.

సుల్తానాబాద్, జూలై 16: రెండున్నరేళ్ల చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా పూసాల, నారాయణపూర్ కొత్తపేట తదితర గ్రామాలలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చినారులను చేర్పించడం ద్వారా కలిగే ప్రయోజనాల గురించి, ప్రభుత్వాలు అందిస్తున్న సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రాజేశ్వరి, స్వరూప రాణి టీచర్లు సుభాషిణి, ఆకుల విజయలక్ష్మి మంద సులోచన, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఇసుక, మట్టి అక్రమ రవాణా

● చోద్యం చూస్తున్న అధికారులు

ముత్తారం, జూలై 16: మండలంలోని ఖమ్మంపల్లి మానేరు నది నుంచి ఇసుక, గుట్టల నుంచి మట్టిని గ్రామానికి చెందిన కొంతమంది అక్రమార్కులకు వరంగా మారాయి. మానేరు నది నుంచి ఇసుకను రామగిరి, బేగంపేట్, సెంటినరీ కాలనీ, ఇతర ప్రాంతాలకు జోరుగా రాత్రి, పగలు తేడా లేకుండా గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని శ్మశానవాటిక వెనుక వైపు ఉన్న గుట్టను ఇప్పటికే కొంతమంది అక్రమార్కులు సగానికి పైగా తొలిచి మట్టిని అక్రమంగా తరలించారు. ఇసుక క్వారీలకు రోడ్ల పేరుతో పలు రకాలుగా మట్టిని తవ్వుకు వెళ్లారు. కనీసం అటువైపు ఏ శాఖకు సంబంధించిన అధికారులు కూడా వెళ్లిన దాఖలాలు లేవు. ఇసుక మేటల పేరుతో అనుమతులు పొందిన వారు మానేరు నదిలో అక్రమంగా వందల ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికి రెవెన్యూ, మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదని, కలెక్టర్ స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్

శ్రీరాంపూర్, జూలై 16: సింగరేణి బొగ్గు కొనుగోలు చేసే వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయనున్నట్లు సీఎండీ ఎన్ బలరాం అన్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈ-వేలం వినియోగదారులు, వ్యాపారులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో బొగ్గును వినియోగిస్తున్న సుమారు 80 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొని సూచనలు, సలహాలు ఇచ్చారు. వినియోగదారులకు సమాచారలోపం లేకుండా, ఇబ్బంది కలగకుండా ఉండేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయనున్నామని, అందులో సభ్యుడిగా తాను కూడా ఉంటానన్నారు. సమావేశంలో జీఎం(మార్కెటింగ్) జి దేవేందర్, అదనపు జీఎం రాజశేఖర్‌రావు,డీజీఎం రవిశ్రీవాస్తవ పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలంపై రాద్ధాంతం

- బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని, జూలై 16: నూతన బొగ్గు గనుల వేలంపై కొంతమంది రాజకీయం చేస్తున్నారని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య ఆరోపించారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2015లో పార్లమెంట్‌లో ఎంఎండీఆర్ చట్టాన్ని ఆమోదించారని, ఒరిస్సాలోని నైని బ్లాక్‌ను, మహాపాత్ర బాక్‌ను సింగరేణి వేలం పాటలో దక్కించుకోవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం నూతన బొగ్గు బ్లాకుల వేలం పాటల్లో సింగరేణి యాజమాన్యాన్ని పాల్గొనకుండా చేయడం వల్లనే కేంద్ర ప్రభుత్వం వేలం పాట పెట్టిందన్నారు. ఎంఎండీఆర్ చట్టంలో మార్పులు చేయాలని గతంలోనే బీఎంఎస్ సూచించడం వల్ల కొన్ని మార్పు చేశారని చెప్పారు. గత రాష్ట్ర ప్రభుత్వానికి బొగ్గు బ్లాకులను వేలం పాటలో సింగరేణి యాజమాన్యం పాల్గొనకుండా చేసిందని, ఇప్పుడు దీన్ని రాద్ధాం చేస్తున్నారని ఆరోపించారు. దేశ వ్యాప్తంగా బొగ్గు గని కార్మికుల రక్షణ, పరిరక్షణ కోసం నిరంతరం బీఎంఎస్ పోరాటం చేస్తుందన్నారు. నూతన బొగ్గు గనుల సాదనకు బీఎంఎస్ కృషి చేస్తుందని, అఖిల భారత మజ్దూర్ సంఘ్ ప్రధాన కార్యదర్శి సుధీర్ గురుడే శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో కొత్త గనులు వస్తాయని వెల్లడించారని చెప్పారు. సింగరేణికి నూతన బ్లాకుల కోసం సింగరేణి యాజమాన్యం వేలం పాటలో పాల్గొని బ్లాకులను దక్కించుకోవాలని కోరారు. విలేకరుల సమావేశంలో బీఎంఎస్ నాయకులు సారంగపాణి, ఆకుల హరిణ్, మాదాసు రవీందర్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న నాగరాజు గోపాల్

ఫైటింక్లయిన్‌కాలనీ, జూలై 16: బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 18న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ నాగరాజు గోపాల్ పిలుపునిచ్చారు. మంగవారం ఓసీపీ-3 కృషి భవన్‌లో జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సంస్థను పరిరక్షించుకోవాలని నెల రోజులుగా సింగరేణి వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఆందోళనలు చేస్తున్నాయని, అన్ని సంఘాలు 18న చలో హైదరాబాద్ ఆందోళనకు నిర్ణయించినట్టు పేర్కొన్నారు. రాష్ట్రానికి తలమానికమైన సింగరేణిని నిర్వీర్యం చేసేలా ఉన్న వేలం ప్రక్రియను సమష్టి పోరాటాల ద్వారా నిలువరిద్దామని పిలుపునిచ్చారు. ప్రభుత్వరంగ సంస్థగా ఉన్నందునే గడిచిన పదేళ్ళలో సింగరేణి నుండి పన్నుల రూపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు 49 వేల కోట్లు ఆదాయం సమకూరిందని అన్నారు. మరో పదేళ్ళలో సంస్థలోని బొగ్గు నిల్వలు ఖాళీ అవనున్నాయని, ఇపుడు గనులు కేటాయించనుంటే సింగరేణి భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని నాగరాజు గోపాల్ అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అన్వేషించిన గనులు సైతం వేలం జాబితాలో చేర్చడం అన్యాయమని పేర్కొన్నారు. ఇది కేవలం సింగరేణి సమస్య కాదని, నిరుద్యోగ, ప్రభావిత ప్రాంతాలతో లక్షలాది మంది జీవితాలను ప్రభావితం చేసే అంశమని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఆందోళనలకు అన్ని ప్రజా సంఘాలు మేధావులు మద్దతుగా నిలవాల్సి అవరం ఉన్నదని నాగరాజు గోపాల్ పేర్కొన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన ఎల్లో కార్డు, రెడ్ కార్డుల విధానం లోపభూయిష్టమైనదని, వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ గేట్ మీటింగ్‌లో ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్, ప్రెసిడెంట్ వినయ్, నాయకులు సారంగం, సంపత్, రాంప్రసాద్, నరసింహ, లక్ష్మీరాజం, భూమయ్య, లింగయ్య పాల్గొన్నారు.

బొగ్గు బ్లాకుల వేలం వద్దు

- సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు



సమావేశంలో మాట్లాడుతున్న మందా నర్సింహారావు

శ్రీరాంపూర్, జూలై 16: సింగరేణికి చెందిన బొగ్గు బ్లాకులను వేలం వేయవద్దని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్(సీఐటీయూ) ప్రధా న కార్యదర్శి మందా నర్సింహారావు అన్నారు. స్థానికంగా మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి ద్వారా పన్నులు, ఇతర రూపేణా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్ష కోట్ల రూపేణా పొందుతున్నాయన్నారు. కానీ సంస్థను ప్రైవేటీకరణ చేయాలని కుట్రలు పన్నుతున్నాయని చెప్పారు. దేశంలో తక్కువ ధరతో బొగ్గు అమ్మే సంస్థ సింగరేణి మాత్రమేనని, సింగరేణి వల్లనే దేశంలోని అన్ని రాష్ట్రాలకు బొగ్గు సరఫరా జరిగి విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. కానీ నాయకుల ఆలోచనలతో సంస్థ మూతపడే పరిస్థితి దాపురించదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలలో నామినేషన్ పద్ధతిన గనులను కేటాయించిన కేంద్ర ప్రభుత్వం సింగరేణికి సైతం నాలుగు బొగ్గు బ్లాకులు అదేమాదిరిగా ఇవ్వాలని కోరారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 18న హైదరాబాద్‌లో ఆందోళన చేపడుతున్నామని, కార్మికులు భారీగా తరలిరావాలని కోరారు.

● మూతపడిన సీమ్‌ను తెరిపించాలి

ఆర్కె 7 గనిలో మూతపడిన సీమ్‌ను తెరిపించాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు డిమాండ్ చేశారు. ఆర్కె 7 గనిపై మంగళవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణికి అనుమతులు ఇవ్వకపోవడం సరైంది కాదన్నారు. సంబంధిత అధికారులతో సింగరేణి అధికారులు మాట్లాడి వెంటనే అనుమతులు తెప్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వాములుగా ఉన్న సంస్థకు అనుమతులు రాలేదంటే ఇది ఖచ్చితంగా గనిని మూసివేసే కుట్ర అని పేర్కొన్నారు. ఏఐటీయూసీ నాయకులు కార్మిక సమస్యల పరిష్కారంలో వెనకబడ్డారని ఆరోపించారు. సింగరేణితో మాట్లాడాల్సింది పోయి ఇతరులకు వినతిపత్రాలు ఇస్తూ నటిస్తున్నారని దుయ్యబట్టారు. గనిని మూసివేసి ఓసీపీ చేయాలనే ఆలోచనను మానుకొని పూర్తిస్థాయి బొగ్గును వెలికితీసేవరకు కొనసాగించాలని సూచించారు. ఆయా కార్యక్రమాలలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్, జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్, కాంట్రాక్టు కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి దూలం శ్రీనివాస్, యూనియన్ బ్రాంచ్ అధ్యక్షుడు గుల్ల బాలాజీ, ఆర్గనైజింగ్ కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్, ఆర్కె 7 పిట్ కార్యదర్శి శ్రీధర్, అసిస్టెంట్ కార్యదర్శి సమ్మయ్య, నవీన్, ఇప్ప నరేష్, బానేష్, లక్ష్మణ్, అనిల్, భగవాన్ రెడ్డి, ప్రవీణ్, శంకర్ రాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తి జరగాలి

జైపూర్, జూలై 16: రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తి జరగాలని సింగరేణి ప్రాజెక్టు అండ్ ప్లానింగ్ డైరెక్టర్ జి వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. ఎస్టీపీపీ యూనిట్ 2లో జరుగుతున్న క్యాపిటల్ ఓవరాలింగ్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. బాయిలర్, టర్బైన్ , జనరేటర్ ఇతర విభాగాల్లో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. క్యాపిటల్ ఓవరాలింగ్ పనుల్లో పాల్గొంటున్న ఇంజనీర్లు, ఉద్యోగుల పనితీరుపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా ప్లాంట్‌ను విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్టీపీపీ అధికారులు జేఎన్ సింగ్, శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి, ఎస్టీపీపీ జీఎం కే శ్రీనివాసులు, ప్రసాద్, రమణ, మదన్‌మోహన్, సముద్రాల శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎస్టీపీపీలో పనులను పరిశీలిస్తున్న సింగరేణి డైరెక్టర్

గ్రామాల్లో ముమ్మరంగా వైద్య శిబిరాలు


కాట్నపల్లిలో డెంగ్యూ బాధితుడి ఇంటిలో స్ప్రే చేస్తున్న వైద్య సిబ్బంది


గుండారంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సుల్తానాబాద్, జూలై 16: మండలంలోని కాట్నపల్లిలో డెంగ్యూ కేసు వెలుగు చూసినట్లు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. గ్రామానికి చెందిన ఒక యువకుడు హైదరాబాద్‌లో కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడని, అతని బంధువులు చనిపోతే ఆయన స్వగ్రామానికి వచ్చాడని వివరించారు. ఈ నెల 13న జ్వరంతో బాధపడుతూ సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేరాడని, సోమవారం ఆయనకు రక్త పరీక్షలు నిర్వహించగా డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో గర్రెపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనుదీప్, ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

కమాన్‌పూర్, జూలై 16 : మండలంలోని గుండారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోగులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రజలకు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుమతి, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్యలు ఉన్నారు.

ఎలిగేడు, జూలై 16: మండలంలోని సుల్తాన్‌పూర్, ర్యాకల్‌దేవ్‌పల్లి, ముప్పిరితోట గ్రామాల్లో మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. సుల్తాన్‌పూర్‌లో 60, ర్యాకల్‌దేవ్‌పల్లిలో 45, ముప్పిరితోటలో 70మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఇంటింటా ఫీవర్ సర్వే చేసి పలు సూచనలు, సలహాలు అందించారు. వర్షకాల సీజన్‌లో పరిస్థితులకు అనుకూలంగా ఇంటింటా సుచి, శుభ్రతను పాటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్‌ప్రొవైడర్ వినయ, పీహెచ్‌సీ వైద్యులు నిస్సిక్రిష్టాన, సిహెచ్‌వో విజేందర్‌రాజు, సూపర్‌వైజర్స్ లక్ష్మణ్, నాగరాణి, ఏఎన్‌ఎంలు దేవేంద్ర, లత, అంగన్‌వాడీ టీచర్స్, జీపీ కార్యదర్శులు, బ్రీడింగ్ చెక్కర శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, జూలై 16: మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో మంగ ళవారం వైద్య శిబిరం జరి గింది. గ్రామస్తులకు ప్రభుత్వ డాక్టర్ భావన వైద్య పరీక్షలు నిర్వహించారు. డెంగ్యూ, ఇతర వ్యాధుల గురించి, కలుషిత నీటి గురించి గ్రామస్తులకు వివరించారు. అనంతరం మందులు అంద జేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో ఆరెల్లి లక్ష్మణ్, ఏఎన్‌ఎంలు విజయ, శైలజ, ఆశాలు రజిత, అరుణ పాల్గొన్నారు.

రామగుండం అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

కళ్యాణ్‌నగర్, జూలై 16: రామగుండం అభివృద్ధిని కొంత మంది రాజకీయ నాయకులు తమ స్వార్థం కోసం అడ్డుకుంటున్నారని రామగుండం కార్పొరేషన్ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి కండె కృష్ణ ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని చౌరస్తాలో రామగుండం కార్పొరేషన్‌కు చెందిన ఆటో యూనియన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరిఖని లక్ష్మీనగర్ ప్రాంతం అభివృద్ధి చెందితే ఇక్కడ నిరుద్యోగులకు ఉపాధి లభిస్తుందని, షాపింగ్ మాల్స్, జువెల్లరీ షాపులు వస్తే ఉపాధి లభించడంతో పాటు వ్యాపార అభివృద్ధి పెరుగుతుందని, కానీ కొంత మంది స్వార్థ రాజకీయ నాయకులు తమ ఉనికి కోల్పోతారనే నెపంతో అభివృద్ధిని అడ్డుకుంటున్నారని, 30ఏళ్లుగా రామగుండం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదని, రామగుండం ఎమ్మెల్యేగా మక్కాన్‌సింగ్ ఎన్నికైన నుంచి ఊరి కోసం ప్రయత్నిస్తుంటే దానిని కొంత మంది అడ్డుకుంటున్నారని, రామగుండం జిల్లాను కాకుండా చేసింది గత మాజీ ప్రజా ప్రతినిధులు కాదా అని ఆయన ప్రశ్నించారు. కొంత మంది అక్రమంగా షాపులు నిర్మించుకుని కిరాయిలు పొందుతున్నారని, వారు కార్మికులను రెచ్చగొడుతూ క్వార్టర్లను ఖాళీ చేయకుండా అడ్డుకోవడం సరైంది కాదన్నారు.

'రైతులను గోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం'

కమాన్‌పూర్, జూలై 16: ఆంక్షల రుణమాఫీతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం గోస పెడుతోందని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ రుణమాఫీ కుటుంబాన్ని గుర్తించడానికి రేషన్‌కార్డు లింకు చేయడం, పీఎం కిసాన్ నిబంధనలు పాటించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. రుణమాఫీ హామీని యథాతథంగా అమలుచేయాలని లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యూత్ మండలాధ్యక్షుడు బొమ్మగాని అనిల్‌గౌడ్, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, ఏఎంసీ వైస్ ఛైర్మన్ గుర్రం లక్ష్మీమల్లు, మాజీ ఉప సర్పంచ్ పొలుదాసరి సాయికుమార్, నాయకులు నీలం శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, తోట రాజ్‌కుమార్‌లు ఉన్నారు.

'మంథని అభివృద్ధిపై పట్టింపు కరువు'

మంథని, జూలై 16: అమృత్ 2.0 ద్వారా మంథని పట్టణంలో మంజూరైన వాటర్‌ట్యాంక్ నిర్మాణంలో కాంట్రాక్టర్‌ను ఇబ్బందులు పెట్టవద్దని ఎమ్మెల్యే కౌన్సిలర్లకు వార్నింగ్ ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలు అర్థం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు చేపట్టిన సంస్థ సీఎం బంధువులదని, మంథనిలో ప్రజలు ఇళ్లు కూలగొట్టినప్పుడు స్పందించని ఎమ్మెల్యే వ్యాటర్‌ట్యాంక్ కాంట్రాక్టర్ విషయంలో స్పందించడాన్ని అర్థం చేసుకోవాలన్నారు. పదేళ్లయినా మున్సిపాలిటీకి భవనం లేదని, ఊరి అవతల నిర్మిస్తామని మాట్లాడిన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండేలా మున్సిపాలిటీ ఉండాలి కానీ ఎక్కడో నిర్మిస్తామని చెప్పడం విడ్డూరమన్నారు. ఎమ్మెల్యేకు డీపీడీపై ఉన్న ధ్యాస పట్టణ అభివృద్ధిపై లేదని, మున్సిపాలిటీ అభివృద్ధికి రూ.35కోట్లు తెచ్చామని చెబుతున్నారే కానీ అవి ఎక్కడి నుంచి వచ్చాయో చెప్పడం లేదని, పట్టణ ప్రజలు ప్రతి విషయాన్ని గమనించాలని కోరారు.

'శిక్షణ తరగతులకు తరలిరండి'

పెద్దపల్లిటౌన్, జూలై 16: పెద్దపల్లి ఆర్కే గార్డెన్‌లో ఈనెల 21న జరిగే డాక్టర్ బీఆర్ అంబేద్కర్ శిక్షణ తరగతులకు పెద్దఎత్తున జనం తరలి రావాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాపయ్య మాట్లాడుతూ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని బలోపేతం చేయడానికి ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి అన్ని వర్గాల సంఘాలు, ప్రజలు పాల్గొని విజయ వంతం చేయాలని విజ్ఞప్తి చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంప్లి సతీష్, జిల్లా కో కన్వీనర్ ఇండివెల్లి రవీందర్, సంకనపల్లి లక్ష్మయ్య, దాసరి రామస్వామి, కట్కూరి సందీప్, పెద్దపల్లి మండల కన్వీనర్ నారాయణ, మట్ట శంకర్, బోసెల్లి మహేష్, సుద్దాల సురేష్, మేకల సురేష్ గొట్టే లింగయ్య పెరక శంకర్ తదితరులున్నారు.

ప్రత్యేక ప్రార్థనలు

కమాన్‌పూర్, జూలై 16: మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో మొహర్రం పండుగను పురస్కరించుకొని మంగళవారం పీరీల మట్కీలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం పండుగ సందర్భంగా తొమ్మిదవ రోజు పీరీల వద్ద మట్కీలు తీయడం ఆనవాయితీగా వస్తోంది. జూలపల్లి, గుండారం, పీరాపల్లి, రొంపికుంట, పెంచికల్‌పేట తదిత గ్రామాల్లో నిర్వహించుకున్నారు. బుధవారంతో మొహర్రం వేడుకలు ముగియనున్నాయి.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

పెద్దపల్లి రూరల్, జూలై 16: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని సబ్బితం, కాపులపల్లి, కనగర్తి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఇంటింటా తిరుగుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని దోమలు వృద్ధి చెందకుండా నిలిచి ఉన్న నీటిని తొలగించాలని ప్రజలకు సూచించారు. వారి వెంట ఎంపీవో సుదర్శన్, మండల విద్యాధికారి సురేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శులు రవి, మౌనిక, శ్రీలత పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, జూలై 16: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో రామ్మోహనచారి, తహసీల్దార్ జాహెద్ పాషా సూచించారు. మండలంలోని 24గ్రామపంచాయతీలో మంగళవారం స్పెషల్ డ్రై డే కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు, వైద్య సిబ్బంది గ్రామాల్లోని వాడవాడలా తిరిగి గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా చెత్తను తొలగించారు. డ్రైనేజీలను శుభ్రం చేయించారు. కుండీలలో నీరు నిల్వ ఉంచకూడదని, దీంతో దోమలు తయారై డెంగ్యూ ఇతరాత్ర రోగాలు వచ్చే ప్రమాదం ఉందని గ్రామస్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో గోవర్ధన్, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజన, ఏఎన్‌ఎంలు సుధా, వాణి సునంద, సునీత, విజయ, సరోజన, శైలజ, శోభ, పద్మ, సరిత, కవిత గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

'ఉద్యమాలతోనే రైతు సమస్యలకు పరిష్కారం'

ఓదెల, జూలై 16: ఉద్యమాలతోనే రైతుల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, అన్ని వనరులు ఉన్నప్పటికీ ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారని తెలిపారు. రైతన్నలను చైతన్య పరిచి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈనెల 21న, గోదావరిఖని బస్టాండ్ దగ్గరలోనీ జీఎం కార్యాలయం ఎదురుగా ఉన్న సింగరేణి కమ్యూనిటీ భవన్ లో తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి ఆధ్వర్యంలో రైతు సదస్సును ఏర్పాటు చేసినట్లు మల్లన్న తెలిపారు. ఈ సదస్సుకు ప్రొఫెసర్లు ఎమ్మెల్సీ కోదండరాం, హరగోపాల్, డాక్టర్ కాశిం, గాదే ఇన్నారెడ్డి, పౌర హక్కుల సంఘం నుండి గడ్డం లక్ష్మణ్, విరసం నుంచి పాణి, డాక్టర్ గోపీనాథ్, ఐ.ఎన్.టి యుసి నుంచి జనక్ ప్రసాద్, హెచ్ ఎం ఎస్ నుంచి రియాజ్, యాదవ రెడ్డి తో పాటు తదితరులు హాజరవుతున్నారని, రైతులు పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని మల్లయ్య కోరారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం

-పట్టించుకోని అధికారులు

ఓదెల, జూలై 16: మండల కేంద్రంలో ఉన్న విద్యుత్ స్తంభం గ్రామస్థులకు అత్యంత ప్రమాదకరంగా మారింది. గ్రామంలోని జండా చౌరస్తాలో ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఇక్కడి నుంచి తొలగించాలని కొన్నాళ్ల నుంచి అధికారులతో మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదని పలువురు యువకులు వాపోతున్నారు. వర్షం కురిస్తే చాలు ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతోంది. ప్రధాన రహదారికి ఆటంకంగా ఉన్న స్తంభాన్ని వెంటనే తొలగించి, ప్రమాదాల నుంచి తప్పించాలని గ్రామస్థులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

జోరందుకున్న వ్యవసాయ పనులు

పాలకుర్తి, జూలై 16: మండల వ్యాప్తంగా కురుస్తున్న చెదురు,మదురు వర్షాలతో పల్లెల్లో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. మొన్నటివరకు ఏ మాత్రం వర్షాలు లేక దిగాలు పడిన రైతులు గుండిలో మెల్లగా కురిసిన వర్షాలకు ఉత్సాహంతో పొలాల్లోకి దిగారు. మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో జోరుగా వరి నాట్లు సాగుతున్నాయి. జూన్‌లో వర్షాలు ముఖం చాటేసినా తాజాగా వర్షాలు పడడంతో చెరువులు, కుంటల్లోకి సరిపడా నీరు రాకున్నా బావులు, బోర్లను నమ్ముకొని పొలాలు దున్ని నాట్లకు సిద్ధమయ్యారు. ఇప్పటికే రెండు నెలల నుంచి వర్షాలు కురవక కాలం గడిచిపోయిందని రానున్న మరో రెండు నెలల్లోనైన కురువకపోతాయా అనే నమ్మకంతో నాట్లకు సిద్ధమయ్యామని రైతులు అంటున్నారు. రానున్న రెండు నెలల్లో వర్షాలు కురవకపోతే ఆరుకాలం శ్రమించి అప్పులు తెచ్చి పంటలను సాగు చేస్తున్న తమకు తిప్పలు తప్పవని రైతులు పేర్కొంటున్నారు.